పిల్లలు. టీ. బీ. లో దించింది. మీరు అజ్ఞానంతో పెళ్ళిళ్ళు చేసి అన్యాయంగా వీళ్ళ ప్రాణాలు తీస్తున్నారు" అన్నది.

ఇంటికి తిరిగివచ్చి శంకరం సీత విచారంతో చెరి ఒకవైపునా గోడకు చేరగిలపడి కూర్చున్నారు. ఇంతలో నలుగురు పోలీసులు కృష్ణణ్ణి వెంటబెట్టుకుని వచ్చారు. కృష్ణణ్ణి పోలీసులు వెంటబెట్టుకుని రావడం, తల్లి తండ్రులు చూచి నిర్ఘాంతపొయ్యారు. నీ కొడుకు రైల్లో పర్సు కొట్టేశాడు. మీ యిల్లు సోదా చేయాలి అన్నారు పోలీసులు. సీత మావాడు అటువంటివాడు కాడు నాయనా అని ఏడవడం ప్రారంభించింది.

కష్టాల్లోనే కష్టాలు. వచ్చిన పోలీసులు అక్కడ వుండగానే పెళ్ళికి అప్పుచేసిన బాకీ షావుకారు యమధర్మరాజు చిత్రగుప్తుణ్ణి దూతలనూ వెంట వేసుకుని వచ్చినట్టు కోర్టు అమీనాను, వెట్టివాళ్ళను వెంటవేసుకుని ఇల్లుజప్తుచేయించటానికి వచ్చాడు. ఇదంతా చూసేసరికి శంకరం భార్యాభర్తలకు ఇల్లు నాలుగు మూలలూ ఒక్కసారే అంటుకున్నట్టయింది.

---

నాయికాభినయం

# వాసకసజ్జిక

నటరాజ రామకృష్ణ

"రాజనిభాననా! సరసురాలవు,
జబ్బుగా నల్లినా వదేమే జడ?"
'ఇంతకంటే వలెనే?'
'వలనొప్పు బిగించి యల్లవే
ఓ జవరాలా! వేరొక పనియున్నది'
'దోసమె దోసమే చెలీ!
రాజగునట్టి యవ్విజయరాఘవు
మై చిగురాకే కోమలీ'

సాయం సమయము. సంజె వెలుగులో ఆకాశమంతా అప్పుడే మెరుగుపెట్టిన బంగారు గోపురంలా తళతళ మెరిసిపోతోంది. కోట సింహద్వారమువద్ద మ్రోగింపబడుతున్న సన్నాయి మంగళవాయిద్యము సన్నగా వినబడుతూంది.

పట్టమహిషిగారి అంతఃపురము, అలంకార మందిరములో అద్దము ముందుగూర్చొని పైవిధముగా చెలికత్తియతో సంభాషించుచు, అలంకారమును ముగించుచున్నది. నాడు విజయరాఘవుడు పుట్టినరోజు. దేవిగారి మందిరమునకు వేంచేయుదురని వార్తనంపిరి. అందులకే ఈ తొందర.

* * *

రాజసభ పండిత కవి, గాయకులతో నిండి కిటకిటలాడుతూంది. దర్బారుహాలుకు చివరగానున్న నృత్యవేదిక మామిడాకు మొగలిరేకుల తోరణాలతో, చేమంతిదండలతో అలంకరించబడివుంది. రంగస్థలముపై రంగురంగుల పద్మములు, లతలూ, తీగెలముగ్గులు చిత్రించబడినవి.

రంగాజమ్మ విజయరాఘవుని పత్నియేగాక కవయిత్రి, నృత్యగానములందు అసమానపాండితీ ప్రతిభగల మేధావి. రచయిత్రి, తనచే రచింపబడిన "మన్నారుదాస విలాస" యక్షగానము తననాథునికి పుట్టినరోజు కానుకగా అంకితమొసగుచున్నది. అంతియేగాక నాడు ఆ యక్షగాన ప్రథమ ప్రదర్శనము, అందు రంగాజమ్మ నాయిక పాత్రధరించి అభినయించుట గూడను. శుభముహూర్తమాసన్నమైన వెంటనే మంగళవాయిద్యములు మ్రోగుట మొదలిడినవి. పండితులు వేదములను పఠించుచుండిరి. ఒక సువర్ణపేటికలో నుంచిన ఆ గ్రంథమును, రంగాజమ్మ విజయరాఘవునకు సమర్పించింది. పండితులు మంగళాచరణములు చదివారు.

* * *

రాణివాసములో పట్టమహిషి తన అలంకారము ముగించుకొని అద్దము ముందు నిలబడి నునుతేత దీపకాంతిలో తనయొక్క సౌందర్యమును చూచి మురిసిపోవుచున్నది. శయ్యామందిరమును చెలికత్తెలు అలంకరించిన దానితో తృప్తినొందక

తాను స్వయంగా మెరుగులు దిద్దుతోంది. పాల నురుగువంటి తెల్లని శయ్యపై సన్న జాజులు పరిపించినది. కస్తూరి, గంధము, అత్తరు, పన్నీరు సిద్ధపరచినది. ప్రభువు నలంకరించుటకు తన స్వహస్తములలో అల్లిన సన్న జాజుల మాలను భద్రపరచినది. తన కోమలకంఠంతో పాడి విభుని ఆనందపరచుటకు వీణ శ్రుతి జూచుకున్నది. కనీకనబడని నునులేత కాంతిలో తన సౌందర్యమును స్వామి వారికి కనబర్చవలెనని అబలాటంతో గాజు కుప్పెలలోని దీపపు కాంతిని తగ్గించమని చెలుల నాజ్ఞాపించుచున్నది.

* * *

రాజసభలో —

రంగాజమ్మ "మన్నారు దాస విలాసము"లోని ఒక ఘట్టము నభినయించుటకు ఆహార్యము ధరించి సిద్ధముగానున్నది. మార్దంగికులు తమ మృదంగముల శ్రుతి జేసుకున్నారు. వైణికులు, గాయకులు, నటులు అందరూ అంబ ప్రార్థన ముగించారు. రంగాజమ్మ "పుష్పాంజలి" సమర్పించుటకు చేత పుష్పములుగొని సభావేదికపైకి వేంచేసింది.

అంత మంత్రిగారు తమ స్థానము నుండి లేచివెళ్ళి మెల్లగా విజయరాఘవునితో యేమియో చెప్పారు. రాజాముఖము సంతోషముతో వికసించింది.

క్షేత్రయ్య! దక్షిణదేశ నృత్యకళకు, అభినయవిద్యకు, నూతనజీవము పోసిన క్షేత్రయ్య!! దక్షిణాది పుణ్యక్షేత్రములను దర్శించి విజయరాఘవుని దర్బారు కరుదెంచారు. క్షణములో సభలోని వారందరికీ ఈవార్త తెలిసిపోయింది.

రంగాజమ్మ తన్మయురాలైంది. తన జన్మ ధన్యత జెందినట్లు తలచింది. తన కవిత, విజయరాఘవుని కంకితముజేసిన తన కవితను, తానభినయించుచుండగా, క్షేత్రయ్యవంటి మహాపురుషుడా సభ నలంకరించుట యెంతటి మహాభాగ్యము. తన అభినయ విద్య ప్రదర్శించుటకు మంచి అదను. క్షణకాలమా విధంగా తలంచుకొని సంతోషముతో ఉబ్బి తబ్బిబ్బైంది.

రాజు, మంత్రులు, సభలోని పండితులందరూ ఎదురేగి క్షేత్రయ్యను సభా మందిరములోనికి తోడ్కొని వచ్చిరి.

వెంటనే రంగాజమ్మ అభినయము మొదలుపెట్టినది.

కన్నడ—ఆది

హితమైన నెచ్చెలు లెవ్వరున్నారు
రతిరాజు గెల్చు విజయరాఘవు గూర్చుటకు
కనురెప్ప వేసితే కలికిరో యిపుడు
యెనయంగ వాడు నా యెదుట నిల్చేని
ఎవరు మాటాడిన యేమి నా చెవులకు
నువిద వాని పలుకువలె నున్నదివె
వేమఱు నెవ్వరి పేరునా బిలిచినా
ప్రేమ మన్నారు దాసాయనే పేరు వచ్చేనే

* * *

తన హృదయేశ్వరుడు రాకపోయె. గడువు దాటినది. రాణిగారి హృదయం పరిపరి విధముల పరితపించుచున్నది. సభామందిరమునకు తనుగూడ అరుగుదెంచినది.

అచ్చట యేమి జరుగుచున్నది?

ఇంద్రసభను మరిపించు ఆ సభాస్థలిలో వంత పాటకులు కంఠము లెత్తి పాడుచుండగా, ఝణ్ మని తాళము మ్రోగిస్తూ నటుడు ఆమె ననుసరించి, వీణ మధుర ఝుంకార నాదములో కంఠము జేర్చి పాడుతూ ఒడలు మరిచి అభినయిస్తూ రంగాజమ్మ ఆ సభను మంత్ర ముగ్ధులను జేసింది.

"హితమైన నెచ్చెలు లెవ్వరున్నారు."

అన్నప్పుడు ఆమె అభినయించిన శంక, వితర్కం, ధైర్యం, నిర్వేదము—పండితుల హృదయాలను కలిగించివేసింది. ఆ నాయికయొక్క వియోగాన్ని తామే అనుభవిస్తున్నట్లు ప్రేక్షలోకం అనుభూతిపొందింది.

క్షేత్రయ్య నేత్రాలు ఆనందబాష్పాలను రాల్చినవి. నాడు రంగాజమ్మ చేయునది అభినయమును మరిచి అదే బృందావనం - యమునా తీరపు పూపొదరిండ్లు, వనమాలి వియోగముతో కృషించుచున్న రాధ అతని కనులముందు సాక్షాత్కరించినది.

వెంటనే క్షేత్రయ్య ఒక సువర్ణపత్రము చేతగొని, క్షణకాలము యేదోవ్రాసి ముగించాడు. అదే ఈ పదరూపము నొందినది.

'ఇంత ప్రొద్దాయె - నింకవాడేమి వచ్చేని?
చింతింప బనిలేదు - చెలియ! మువ్వా గోపాలు.

చేరి నాతో నేస్తము - చేసినపాపమా.
కీరవాణిరో యేలవే - గించేవే నీవు.
నూరిన గంధ కస్తూరి - పారవేసి పవ్వళించు
యేరమణి యింటనున్నాడో - యూరెల్ల
మాటుమడచె॥

నాట్యాచార్యుడు కల్లయ్య ఆ స్వర్ణపత్రము నందుకొని ఒక నిమషము దానినిజూచి పాడుట కుపక్రమించాడు. అలంకార శాస్త్రనిధి రంగాజమ్మ - ఆమెకు క్రొత్తయేమి? ఆ భావమును వెంటనే అభినయించుటకు మొదలిడినది.

అనుకోకుండానే రాణిగారి నేత్రాలు అశ్రుపూరితాలయ్యాయి. అవియెట్టి బాష్పాలో ఆమె హృదయతంత్రుల మీటినట్లుయింది. అది తన జీవితమే. క్షేత్రయ్య యెంత చక్కగా మానవ హృదయాన్ని అర్థముచేసుకొన్నాడు. మానవుల అనుభావాల్ని యెంత చక్కగా చిత్రించాడు. ఆపదంలోని నాయిక వంటిదే గదా తన జీవితము. రంగాజమ్మ అభినయం. యెంత నిర్దుష్టంగావుంది. తన హృదయాన్నే, తన ఆవేదన్నే రంగాజమ్మ అచ్చుట చిత్రిస్తూవుంది. ఈవిధంగా ఆమెతలుచుకుంటూ టెక్కెముపై ఒరిగి ఆ అభినయాన్ని తిలకిస్తూవుంది. రంగాజమ్మ తీర్మానమాడి ముగించింది. కోటలోని గంటలు నాలుగు కొట్టినవి.

రాణిగారి హృదయం క్రోధంతో దహించిపోతోంది. తననాథునికి,తనకుమధ్య ఒకచీకటితెరగా నిల్చింది రంగాజమ్మ అని తలిచింది. ఆమె తన వాక్చాతుర్యము పాండిత్యములో తన నాథుని వశపరుచుకొన్నదని యెంచి ఆ కోపములో తన్ను తామరిచి-యేమియా ఒక లేఖపై వ్రాసి చెలికత్తె ద్వారా రంగాజమ్మకు పంపినది. నాడు రాణిగారు ఆ లేఖ నంపనిచో పండిత హృదయరంజకమైన ఈ చాటువు, రంగాజమ్మ రాణిగారికి - వ్రాసిన జవాబు, ఆంధ్రసాహిత్యంలో చూచేవారమే గామేమో?

ఏ వనితల్ మముందలప నేమిపనో
తమరాడువారుగారో?
వలపించు నేర్పెరుగరో?
తమ కౌగిటలోన నుండ
రావది యేమిరా, విజయరాఘవా?
యం చిలుదూరి బల్మిచే
దీవర కత్తెనై పెనగి తీసుకవచ్చితి నా
తలోదరీ.

* * *

ఇందలి క్షేత్రయ్య పదములోని నాయిక వాసక సజ్జిక, పరకీయ.

విరహ విప్రలంభ శృంగారము, కరుణరసము. ఇందు వచ్చే సంచారులు.

చింత, శంక, విషాదము, నిర్వేదము, స్మృతి, శ్రమ, దైన్యము, ఈర్ష్య, సుప్తి.

ప్రియుడు రాగలడని తానలంకరించుకొని, గృహమునలంకరించి సిద్ధముగా యుండు నాయిక వాసకసజ్జిక.

"యవనమూ సమూహముల। నాజి
జయించి యుదగ్ర దిగ్గయో
త్సవ విభవాభి రాముడయి। సారెకునోబయ
నారసింహ భూ
ధవు డరుదెంచు లగ్నమున। తత్పుర లక్ష్మి
విభూషి తోల్లస
ద్భవన విశేషయై మృగమ। దద్రవ వాసన
దాల్చు నిచ్చలున్॥"

ఈ నాయిక చేష్టలు.

(1) సఖులతో వినోదములు సల్పుట.

(2) కోరికలు.

(3) మాటిమాటికి దారిజూచుట, వచ్చెడి వారిని నాయకుడని భ్రమించుట.

(4) అనుభవింపదగినవి సిద్ధపరుచుట.

* * *

పంతువరాళి—త్రిపుట

ప॥ ఇంత ప్రొద్దాయె - నింక వాడేమి వచ్చేని
విషాదము. నిర్వేదము.
అ॥ చింతింప బనిలేదు-చెలియా మువ్వ గోపాలుడు
నిర్వేదము. చింత దైనము.
చ॥ చేరి నాతో నేస్తము - చేసిన పాపమా
స్మృతి. వితర్కం.
కీరవాణిరో యేలవే - గించేవే నీవు
విషాదం దైన్యం. రోషం.
వితర్కం.
నూరిన గంధ కస్తూరి - పారవేసి పవ్వళించు
శ్రమ. శోకము.
ఏరమణి ఇంటనున్నాడో-యూరెల్లమాటుమడగా
ఈర్ష్య శంక సుప్తి, నిర్వేదము.